కథ

# మార్గదర్శి

**- లలితా శేఖర్**



గోదావరి ఎక్స్‌ప్రెస్ హైదరాబాద్ చేరడానికి ఇంకా గంట టైముంది. కొండల మీంచి ఉబికి వస్తున్న అరుణ కాంతులలో ఇనబింబం ప్రకాశిస్తోంది. కాఫీవాలా కనబడతాడేమోనని చూశాను. మనసు రవీంద్ర వైపు మళ్లింది.

క్రితం సంవత్సరం నేనిలాగే కాలేజీ పనిమీద హైదరాబాద్ వస్తున్నట్టు బాల్య స్నేహితుడు రవీంద్రకు లెటరు రాశాడు. చిన్ననాటి మిత్రుణ్ణి చాలాకాలం తరువాత కలుసుకోబోయే క్షణాల కోసం ఆతృతతో ఎదురు చూశాను. రవీంద్రస్టేషనుకు వచ్చాడు. తాను ఆప్యాయంగా చేయి చాచాడు. రవీంద్ర చేతిస్పర్శలో ఫార్మాలిటీ మాత్రమే తనను స్పృశించింది.

"ట్రైయిన్ గంటపైగా లేట్. ఇక ఎప్పటికీ ఈ దేశం బాగుపడదు" రవీంద్ర గొంతులో విసుగుదల. నా మనసు చివుక్కుమంది.

ఎలాగో సర్ది చెప్పకుంటూ..."ఎన్నాళ్లయిందిరా మనం కలుసుకుని ఎలా వున్నావ్? మా చెల్లెలు కులాసానా?' ' అడిగాను.

"ఆ...అరుణ డెలివరీకి వెళ్లింది" అన్నాడు పొడిగా.

ఇరువురం కారులో కూర్చున్నాం. మాటలు కరువైనట్టు డ్రైవింగ్ మీద దృష్టి నిలిపాడు. నా గురించి ఒక్క ప్రశ్న అడగక పోవటం బాధగానే వుంది. అయినా స్నేహాన్ని గుర్తు చేస్తూ, "మన శ్రీధర్ జ్ఞాపకమున్నాడుగా ఈ మధ్య వాడి కవితా సంపుటికి సాహిత్య అకాడెమీ అవార్డ్ వచ్చింది. నువ్వు పేపర్లో చూసే వుంటావు" అన్నాను.

"పేపర్ చదివే తీరిక ఎక్కడిదీ? హెడ్‌లైన్స్, షేర్స్ చూడటం తప్ప విడిచి. నీకు తెలుసనుకుంటాను. నా బిజినెస్ సర్కిల్ ఎంతగా పెరిగిందో", అంటూ ఫలానా, ఫలానా వ్యాపార సంస్థలకు డైరెక్టర్‌ననీ, పార్ట్నర్ ననీ, ఛైర్మన్ ననీ చెప్పాడు.

"మరి నీ 'లా' ప్రాక్టీసు ఏమైంది?" అడిగాను.

"అదీ వుంది లీగల్‌సెల్‌కు ప్రెసిడెంట్‌ను. నీకు తెలుసా సిటీలో అత్యధికంగా ఫీజు తీసుకునే ముగ్గురు లాయర్లలో నేనొకడిని. రవీంద్ర గొంతులో గర్వం తొంగి చూసింది.

"మరి నువ్వేం చేస్తున్నట్టు?" అడిగాడు.

ఆలస్యంగానైనా నా గురించి అడగటం సంతోషాన్నిచ్చింది.

"లెక్చరర్‌గా చేస్తున్నాను" అన్నాను.

"అంతా కలిపి ఆరేడు వేలు వస్తుందేమో" అన్నాడు.

అవునన్నాను.

"ఎన్నాళ్ళిలా ఎదుగు బొదుగు లేని సంపాదన? ట్యుటోరియల్స్ స్టార్ట్ చెయ్యవలసింది. నా మటుక్కి నేను నెలకు పదివేలకు పైగానే పనివాళ్లకు జీతాలిస్తాను. రూపీ వేల్యూ ఎలా డిక్రీజ్ అవుతోందో చూస్తున్నావుగా?" అన్నాడు.

రవీంద్ర మాటలకు మనసు గాయపడ్డా, "నాకు బాగానే జరిగి పోతూంది. లైఫ్ పీస్‌ఫుల్‌గా సాగిపోతోంది?" అన్నాను.

'పెక్యూలియర్' అంటూ గొణిగాడు.

వున్నట్టుండి కారు సడెన్ బ్రేక్‌తో ఆగింది. ఇద్దరం కంగారుగా కారు దిగాము. ఒక్క క్షణం ఆలస్యమయ్యుంటే పిల్లవాడు కారు క్రిందపడేవాడే. సుమారు పదేళ్ళుంటాయి. వస్తున్న వాహనాన్ని గమనించకుండా రోడ్డు దాటబోయాడు. వాడి శరీరం భయంతో వణకుతోంది. రెండు కాళ్లు 'పోలియో' వ్యాధికి గురి అయి మెలికలు తిరిగి వ్రేలాడుతున్నాయి. మోకాలి చిప్పలు చెక్కుకుపోయి కాయలు కాసి వున్నాయి. చిరిగిన చొక్కా బలహీనమైన దేహాన్ని బయట పెడుతోంది. గుంటలు పడ్డ కళ్లలో భీతి. కారుకు అడ్డంగా వచ్చినందుకు కొడతారనే భయంతో చూస్తున్నాడు.

"డర్టీ బాస్టర్డ్" అంటూ రవీంద్ర కోపంగా చెయ్యి పై కెత్తాడు. నేను ఆపక పోయినట్టయితే ఆ చెయ్యి పిల్లాడి వీపునంటుకునేదే. ఇంతలో ఆ పిల్లాడి తాత కాబోలు పరుగెత్తుకుంటూ వచ్చాడు.

"బాబూ పొరపాటై పోయిందయ్యా! దండాలు బాబూ కుంటి ఎదవ వో నోట సావడు." అంటూ ప్రాధేయపడ్డాడు. అక్కడున్న పాత చెప్పలు, పాలిష్ డబ్బాలను బట్టి అతను పాత చెప్పలు కుట్టేవాడని తెలిసింది.

"డర్టీ క్రీచర్స్ దేశం అంతా ఈ వెధవలే" అనుకుంటూ విసురుగా కారులో కూర్చున్నాడు



రవీంద్ర.

"రవీంద్రా! పాపం ఆ పిల్లాడు మోచే తులు చీరుకుపోయి బాగా రక్తం కారుతోంది" అన్నాను.

"ఇంకా నయం సమయానికి బ్రేక్ వేయక పోయినట్టయితే చచ్చుండేవాడు" అన్నాడు రవీంద్ర కారు ముందుకు పోనిస్తూ.

చేతులతో దేకవలసిన దుర్గతిలో నున్న పసివాడిపై కొంచెం కూడా దయలేని రవీంద్ర వైఖరి నాకు బాధ కలిగించింది. బ్లైండ్ కర్వ్ వద్ద కారు స్లో చేయక పోవటం, హారన్ ఇయ్యక పోవటం రవీంద్ర తప్పు కూడా వుంది. అనుకున్నాను.

కారు రవీంద్ర ఇంటి ముందాగింది. విశాలమైన భవంతి. అందమైన లాన్ రవీంద్ర ఐశ్వర్యాన్ని చాటుతున్నాయి.

"కృష్ణా! నేను తొమ్మిది గంటల కల్లా బయట పడాలి. నువ్వెక్కడి కెళ్లాలో చెపితే డ్రాప్ చేసి పెడతాను." అని నౌకర్ని పిలిచి, కాఫీ బ్రేక్ ఫాస్ట్ సిద్ధం చేయమన్నాడు.

నా కెందుకో రవీంద్ర ఒక అపరిచిత వ్యక్తిగా అనిపించాడు. అరగంటలో స్నానం టిఫిన్ ముగించి బయట పడ్డాం. కారు దిగుతూ చెప్పాను రాత్రి రైలుకు వెడుతున్నాను, నాకోసం ఎదురు చూడద్దని.

"ఓ.కే. బై. సీ యూ" అన్నాడు కారు కదిలిపోయింది.

* * *

రైలు స్టేషను సమీపిస్తోంది. జనం అంతా హడావిడిగా డోర్ వద్దకు చేరిపోయారు. రవీంద్రను కలవాలనే కోరికా, ఉత్సాహం ఇప్పుడు నాలో లేవు. అందుకే నేను వస్తున్నట్టుగా రవీంద్రకు తెలియ పరచలేదు.

జనాన్ని తప్పించుకుంటూ ప్లాట్‌ఫాం మీదకు అడుగుపెట్టాను. నాలుగడుగులు వెయ్యగానే భుజం మీద చేయి పడేసరికి వెనక్కు తిరిగి చూశాను.

రవీంద్ర.

"కృష్ణా! వైజాగ్ నుండేనా? వస్తున్నట్టు లెటరు రాయలేదేం?" అన్నాడు.

"ఎలాగూ వస్తున్నానుగా వచ్చాకా కలవొచ్చని రాయలేదు. నువ్వేమిటిలా వచ్చావు? ఎవరైనా వస్తున్నారా?" అన్నాను ఆశ్చర్యాన్ని కప్పి పుచ్చుకుంటూ.

"అవును మా డిస్ట్రిబ్యూటర్ ఒకాయన వస్తున్నట్టుగా ఇన్‌ఫాం చేశాడు. ఎందువలనో రాలేదు. నిన్ను చూడటమయ్యింది పద" అన్నాడు. మౌనంగా అనుసరించాను.

కారులో కూర్చున్నాం. "కాలేజీ పనేనా? లేక బంధువులెవరైనా?" అడిగాడు.

"లేదు కాలేజీ పనే" అన్నాను.

ఈ మధ్యనే శ్రీధర్ వచ్చాడు. వాడికిక్కడ సన్మానం జరిగింది. నేనూ, అరుణ వెళ్లాము. "మన చిన్నప్పటి విశేషాలన్నీ ఒక్కటీ మరచిపోకుండా చెప్పాడు" అన్నాడు రవీంద్ర.

నా ఆశ్చర్యం రెట్టింపయింది.

"వాడిని చూసి చాలా కాలం అయింది" అన్నాను.

కారు మలుపులోకి రాగానే రవీంద్ర కారు స్లోచేసి, హారన్ ఇచ్చాడు.


"కృష్ణా! నీకు గుర్తుందా? క్రితంసారి నువ్వొచ్చినపుడు ఒక అవిటి పిల్లాడు కారు కింద పడబోయాడు" అన్నాడు.

"అవును గుర్తుంది" అన్నాను ఇంకా ఆ విషయం రవీంద్రకు జ్ఞాపకమున్నందుకు విస్తుపోతూ.

"ఆ పిల్లాడి తాత ఈ మధ్యనే చనిపోయాడు. వాడిని వికలాంగుల హాస్టల్‌లో చేర్చి, గార్డియన్‌గా వుంటున్నాను? అన్నాడు రవీంద్ర.

ఈసారి నా ఆశ్చర్యాన్ని దాచుకోకుండా "ఏమిటీ నువ్వు ఆ అబ్బాయికి గార్డియన్‌గా వుంటున్నావా?" అన్నాను.

"అవును చదువుకుంటున్నాడు. వైద్యం ఇత




రత్రా అన్నింటికీ సహాయంగా వుంటానని చెప్పాను. కుర్రాడు సంతోషంగా వున్నాడు. వీలైనవుడు చూసి వస్తున్నాను." అన్నాడు రవీంద్ర.

కారు రవీంద్ర ఇంటి ముందాగిన విషయాన్ని కూడా నేను గుర్తించలేదు.

రవీంద్ర ఇంట్లోకి అడుగు పెడుతూనే "అరుణా చూడు ఎవరొచ్చారో?" అన్నాడు.

రవీంద్ర భార్య అరుణ బాబునెత్తుకుని వచ్చింది. ఒక నిముషం కొత్తగా చూసి తరువాత పోల్చుకుంది.

"నమస్కారం! కృష్ణన్నయ్య కదూ? మా పెళ్ళికి వచ్చారు. చాలాకాలం అయింది చూసి" అంది నవ్వుతూ.

"అవునమ్మా! బాగున్నారా? అంటూ పలుకరించాను. రవీంద్ర కొడుకునందించాడు. ఆ రాత్రి పని పూర్తి చేసుకుని బయలు దేరబోతూంటే, భార్యాభర్తలు బలవంతంగా ఆపేశారు విశ్రాంతి తీసుకుని వుదయమే వెళ్ళొచ్చంటూ. భోజనం తరువాత ఆరుబయట వెన్నెల్లో కూర్చున్నాం నేమా, రవీంద్ర.

"కృష్ణా! ఒక్కొక్క మనిషి ప్రభావం ఎంతః వుంటుందంటే జీవితం పట్ల దృక్పథాన్నే మార్చి వేస్తుంది. ఈ మధ్య జరిగిన చిత్రమైన సంఘటన చెవుతాను విను" అన్నాడు సిగరెట్టు వెలిగిస్తూ.

'ఊ చెప్పు' అన్నాను కుతూహలంగా.

"నువ్వొచ్చి వెళ్ళాకా ఒకరోజు సాయంత్రం ఐదు గంటలకు ఫోన్ వచ్చింది. అరుణ మగ పిల్లవాడిని ప్రసవించింది తల్లీ బిడ్డా క్షేమం అని. ఆ సాయంత్రమే కారులో బయలుదేరాను. అరుణా వాళ్ళూరికి నాలుగ్గంటల ప్రయాణం. బయలు దేరుతూనే సన్నగా తుంపర గాలి మొదలయ్యాయి. మామూలు వర్షమే ననుకున్నాను. రాత్రి ఏడు గంటల దాకా ప్రయాణం సుఖంగానే సాగిపోయింది. ఆలోచనలన్నీ శ్రీమతి మీద, చంటివాడి మీద. కారు వేగంగా పోనిస్తున్నాను. అవి అమావాస్య రాత్రులు. చినుకులు వర్షంగానూ, సన్నగాలి ఈదురుగాలి గానూ విజృంభించాయి. రహదారి కిరుప్రక్కలా వున్న చింత చెట్లు ఏ క్షణాన్నయినా విరిగి పడేట్టున్నాయి.

రోడ్డుకు మధ్యగా ఏదో ఎర్రగా వెలుగుతోంది. కారు ఆపాను. లాంతరు పట్టుకుని ఎవరో వ్యక్తి రోడ్డుకు మధ్యగా నిలబడ్డాడు.

"ఎందుకు ఆపావు?" విసుగ్గా అడిగాను.

"ముందు వాగు వచ్చేసింది బాబూ! కారు ఎళ్ళదు. కొట్టుకునే పోయే పెమాదం వుంది" అన్నాడతను.

దీపం వెలుగులో ఆ వ్యక్తిని గమనించాను. యాభైపైబడిన వయసు. వంటి చుట్టూ నల్ల దుప్పటి చుట్టుకున్నాడు. టైము చూశాను. ఎనిమిది కావోస్తుంది. డోరు తీసి దిగాను.

"రండి సూద్దురు గాని" అంటూ ముందుకు నడిచాడు. అతన్ననుసరించాను. నాలుగడుగులు వేసేసరికి ఎదురుగా వడిగా పారుతున్న వాగును లాంతరు వెలుగులో చూశాను. శబ్దాన్ని బట్టి తీవ్రతను వూహించగలిగాను. 'నిజమే' ఇతను కారు ఆపక పోయివుంటే ఏం జరిగేది? షర్టు తడిసి వెన్నులోంచి చలి మొదలైంది.

"వాగు తీయడానికి రోజు పడతాది. ముందు కెళ్ళలేరు బాబూ" అన్నాడతను.

"నువ్వెవరు? ఇక్కడేం చేస్తున్నావు?" అడిగాను.

"కూలిపని చేసుకునే వోడిని బాబూ. ఆ కనబడేదే నా గుడిసె" అన్నాడు.

"మరిక్కడెందుకున్నావు?" అన్నాను.

"అల్లంత దూరాన బండి లైట్లు కనబడగానే వొచ్చి ఆవుతున్నాను బాబూ. ఇంతకు మునుపే లారీవోడు వచ్చేశాడు. బగమంతుడి దయవలన ఆపగలిగాను తిరిగెల్లి పోయాడు" అన్నాడు.

వెనక్కు మళ్లటం తప్ప చేయగలిగింది లేదు. గాలి వేగం ఇంకా పెరుగుతూనే వుంది.

"వెళ్లొస్తాను" అన్నాను అవ్వుడి దగ్గర శెలవు తీసుకుంటున్నట్టనిపించింది. "వర్షం పెరుగుతోంది నీవు కూడా వెళ్లిపో" అన్నాను.

"ఎల్తాను బాబూ, ఇంకొద్దిసేపు ఖళ్ళు తిరగతయి. కుసేపు కావలా వుండి పోతాను." అన్నాడు.

చప్పన జేబులోంచి డబ్బు తీసి "ఇది వుంచు" అన్నాను.

"వద్దు బాబూ మీరు ఎల్లిరండి. గాలి పెరుగుతోంది" నాతో పనిలేనట్టుగా వెనక్కు తిరిగెల్లిపోయాడు. కొద్ది క్షణాలు ఆశ్చర్యంలో మునిగిపోయాను. చేసేది లేక కారు వెనక్కు పోనిచ్చాను.

అరగంటలో చాలా దూరమే వచ్చాను గానీ, కారు ఆపక తప్పలేదు. రోడ్డుకు మధ్యగా పెద్ద చెట్టొకటి పడి వుంది. ముందు కెళ్లేందుకు ఏమాత్రం వీలులేదు. విచిత్రమైన పరిస్థితి. గాలి హోరు, వర్షం, పిట్ట అలికిడి కూడా లేదు. ఇక ఈ దారిన వాహనాలు కూడా రావు. రాత్రంతా కారులో జాగరణ చెయ్యాల్సిందే. ఈ గాలికి ఇంకేదైనా విరిగి మీద పడొచ్చు.

ఆ మనిషి ఇంకా అక్కడే వుండి వుండాలి. కారు వెనక్కు పోనిచ్చాను. ఊహించినట్టుగానే, దీపాన్ని పట్టుకుని కారు ఆపడానికి ప్రయత్నిస్తున్నాడు.

"మీరేనా బాబూ, మళ్లీ వచ్చారేంటి?" అన్నాడు.

"చెట్టు పడింది ముందుకెళ్లే వీలు లేదు" అన్నాను కారుదిగి.

"అట్టానా రండి బాబూ నా గుడిసెలో రాత్రుండి తెల్లవారితే దారి సూడొచ్చును" అన్నాడు.

అతనిని అనుసరించాను. పేదవాని గుడిసె ఎలా వుండాలో అలాగే వుంది.

"నువ్వు తప్ప ఎవరూ వుండరా?" అడిగాను.

"నా కూతురుకు పెళ్లి సేశాను బాబూ పట్నంలో వుంటది ఎవుడైనా సూసిపోద్ది. ఆ మంచం మీద కూసోండి బాబూ" అన్నాడతను.

సూట్‌కేస్ తెరిచి టవలు తీసి తల తుడుచుకున్నాను. చలికి వేళ్లు కొంకర్లు పోతున్నాయి. కడుపులో ఆకలి జేబు నిండుగా నున్న పర్సు. ఒకదానికొకటి సంబంధం లేకుండా.

అతను తేమ వలన మండని పొయ్యిని కష్టపడి రాజేస్తున్నాడు.

కిరస మానె అయిపోయినాది. మరిసే పోయాను. తనలో తాను గొణుగుతూ పొయ్యిని గొట్టంతో వూదుతున్నాడు. పొయ్యి మీద గిన్నెపెట్టి నీళ్లు పోసి 'టీ' పొడి కాబోలు వేశాడు. అతని పనిని నిశ్శబ్దంగా గమనిస్తున్నాను.

కాగినది గ్లాసులో పోస్తూ, "వేడిగా కుసింత తాగు బాబూ పాలు లేవు టీనీళ్లు సేశాను" అన్నాడు.

టీ డికాషన్ వేడిగా గొంతు దిగుతూంటే ప్రాణం లేచి వచ్చినట్టనిపించింది. "ఆ మంచం మీద నడుం వాల్చండి బాబూ ఎంత దూరం నుండి వస్తున్నారో?"అన్నాడు.

ఎప్పుడు నిద్దుర పట్టిందో తెలియదు. పక్షుల కూతలకు మెలకువ వచ్చింది. ఆ మనిషి లేడు. ముందుగా నా దృష్టి సూట్‌కేస్ మీద పడింది. ఖరీదైన వస్తువులన్నీ ఎక్కడివక్కడ వుండటం చూసి స్థిమితపడ్డాను. ఆ క్షణం నా ఆలోచనకు సిగ్గు పడ్డాను.

రాత్రి బీభత్సం కొంత ఉపశమించినా, ఇంకా సన్న చినుకు పడుతూనే వుంది. అతనికోసం వెతుకుతూ నలువైపులా చూస్తున్నాను. పచ్చటి వరిచేలు, చల్లటి గాలి ఎంతో ఆహ్లాదకరంగా వుంది వాతావరణం. చేతిలో చెంబు, రెండో చేతిలో సంచి పట్టుకుని బురద కాళ్లతో ఆ మనిషి చేల గట్టమ్మట నడిచి వస్తున్నాడు. అతని వెనుక సూర్యతేజం ప్రకాశిస్తోంది. అదొక సుందరదృశ్యం.

"లేచారా బాబూ! పళ్లు కడుక్కోండి" అన్నాడు. తెల్లటి నురుగులతో నున్న పాల చెంబు, కూరగాయల సంచి క్రింద నుంచి, పొయ్యి వెలిగించే ప్రయత్నంలో పడ్డాడు.

'నీపేరేమిటి?' అడిగాను.

వినబడినట్టు లేదు. టూత్‌బ్రష్ తీసుకుని వంతెన వద్దకు చేరుకున్నాను. ఈ మనిషి లేకపోయినట్టయితే ఎన్ని వాహనాలు జలసమాధి అయ్యేవో. ఏమి ఆశించిందీ తెలియదు. ముఖం కడుక్కునే సరికి 'టీ' గ్లాసులో సిద్ధంగా వుంది. "సాయంత్రానికి వాగు తీస్తది బాబూ కారెల్లి పోతుంది" అన్నాడు.

"నాకోసం నీవేమి ప్రయత్నాలు చేయకు ఆకలి లేదు" అన్నాను. మొహమాటంగా.

సమాధానంగా నవ్వాడు. "ఇంతకంటే తోవ లేదు బాబూ! ఏ చిన్న హోటేలుకు పోవాలన్నా చానా దూరం నడవాల, కడుపులో ఆకలెక్కడికి పోద్ది బాబూ? కుండలో మరిగిన నీళ్లున్నాయి తావం సేయండి." అన్నాడు.

కృతజ్ఞతలు ఎలా చెప్పాలో తెలియక ఆ మనిషి ఆదేశాలు పాటిస్తున్నాను. నా అవసరాన్ని తప్ప ఆర్థికస్థితిని, అవకాశాన్ని ఏమాత్రం లెక్కచేయని అతని వైఖరి నాలో ఆశ్చర్యాన్ని రేకెత్తించింది. "ఏదైనా చేసి ఇతని రుణం తీర్చుకోవాలి" అనుకున్నాను.

"పట్నంలో నీ అల్లుడు ఏం చేస్తుంటాడు?" అడిగాను.

చెప్పాడు.

"డబ్బు సరిపోతుందా? లేక ఇంకేదైనా మంచి పని చూపించమంటావా?"

"మీ దయవల్ల ఆళ్ల బతుకులు సల్లగా సాగిపోతున్నాయయ్యా!" అన్నాడు.

ఈసారి కూడా నా ప్రయత్నం విఫలమైనందుకు నాకు వుక్రోషం కలిగింది. చలించని అతని ఆత్మస్థైర్యం, కొండంత సంతృప్తి నాలో అతని పట్ల గౌరవభావం పెరిగింది. టైము చూశాను. పన్నెండు కావొస్తూంది. సన్నటి గాలులు, పక్షుల కిలా కిలా రవాలు, కుండలో అన్నం వుడుకుతున్న శబ్దం. ఏదో తెలియని ప్రశాంతత మనసుకు.

"వాగు తీసిందేమో చూసి వస్తాను బాబాయ్" అన్నాను.

నేను వూహించినట్టుగానే అతని ముఖం సంతోషంతో విప్పారింది.

"సూసిరా బాబూ ఈలోగా అన్నం పెట్టేత్తాను" అన్నాడు. నిన్నటి నుండి క్షణం క్రితం వరకూ నేను చూసిన మనిషి వేరు. కేవలం ఆర్థికపరంగానే ఆలోచించడం, సంబంధాలు నడపటం అలవాటు పడ్డ నాకు, కళ్ల ముందున్న పొరలు తొలగి నిండు మనిషిని చూడటానికి ఇంత సమయం పట్టింది. అందుకే బాబాయ్ అని పిలిచాను.

హారన్ మ్రోగటంతో ఆలోచనలతో నడుస్తున్న నేను లారీ రావటం గమనించాను. వాగు తీసిందన్నమాట. ఉత్సాహంగా గుడిసె వేపు అడుగేశాను.

ఆకులో అన్నం కూర వడ్డించి వున్నాయి. ప్రక్కనున్న మరో ఆకు తీసి అన్నం కూర రెంటిలోను సర్దాను.

"వాగు తీసిందా బాబూ?" అడిగాడు.

"అవును బాబాయ్ నీకు వేరే పని లేకపోయినట్టయితే, నాతో వచ్చి నీ చల్లని చేత్తో నా కొడుకును ఆశీర్వదించు" అన్నాను.

సమాధానం కొరకు అతని ముఖంలోకి చూశాను. ముఖమంతా నవ్వు. కళ్లనిండా నీరు. "పచ్చి వుల్లలు కద బాబూ పొగ" అంటూ కళ్లు తుడుచుకున్నాడు. 'అలాగే బాబూ' అన్నాడు నవ్వుతూ.


రవీంద్ర చెప్పటం ముగించాడు. కొద్ది క్షణాల్లో నిశ్శబ్దంలో మనసు నెమ్మది నొందింది.

"రాత్రి పది దాటింది. కృష్ణన్నయ్యా పడుకుంటారేమో!" అంటూ అరుణ పిలిచింది.

ఇద్దరం లేచాము.

"రవీంద్రా! మనిషి పట్ల మనిషికి నమ్మకాన్ని పెంచి, మానవతా విలువల్ని కాపాడే మహనీయులు ఇంకా వున్నారు" అంటూ కనబడని ఆ మనిషికి మనసులోనే నమస్కరించాను.

## నవీన్ విధానం



మణిపాల్ యూనివర్శిటీనుంచి కంప్యూటర్ ఇంజనీరింగ్‌లో పట్టా పుచ్చుకుని దాన్ని ప్రక్కనపెట్టి సినిమా రంగానికి వచ్చిన వడ్డే నవీన్‌కి మాస్ హీరోగా ఫాలోయింగ్ రాకపోయినా, 'ప్రియా ఓ ప్రియా', 'పెళ్లి', 'మనసిచ్చిచూడు', 'స్నేహితులు' మొదలైన హిట్లు తగిలేసరికి ఓ మాదిరిగా ఇండస్ట్రీలో సెటిలైపోయినట్లేనంటున్నాడు. అవకాశాలైతే రోజూ వస్తున్నాయట గానీ తానే సెలెక్టివ్‌గా వుంటున్నాడట.